సాక్షి
చిత్తూరు

బుధవారం । 4 । డిసెంబర్ । 2024



అలసత్వం వద్దు
ఎంపీ లాడ్స్ నిధుల ఖర్చులో అలసత్వం వద్దని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అధికారులను హెచ్చరించారు. - 8లో




ప్రతిభకు వైకల్యం అడ్డుకాదు
ప్రతిభకు వైకల్యం అడ్డుకాదని ట్రైనీ కలెక్టర్ హిమ వంశీ అన్నారు. మంగళవారం విభిన్న ప్రతిభావంతుల దినం నిర్వహించారు. - 8లో



ఉత్తమ ఫలితాల సాధనకు 'సంకల్పం'
ఇంటర్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధనకు సంకల్పం కార్యక్రమం ప్రారంభించినట్లు డీవీఈఓ సయ్యద్ మౌలా అన్నారు. - 8లో

వైద్యసేవ సపరేటు





సమాజంలో అవినీతి పెచ్చుమీరుతోంది. వైద్యోనారాయణ హరి అన్నారు పెద్దలు.. అలాంటి వైద్య ఆరోగ్య శాఖ ఇందుకు అతీతం కాకుండా పోయింది. ఆ శాఖను అవినీతి కాలుష్యం ఆవహించి, హానికరంగా మారింది. ప్రతి సేవకూ ఓ రేటు ఫిక్స్ చేసి, దండుకుంటుండడంతో రెండో రెవెన్యూ శాఖగా పేరు తెచ్చుకుని, అవినీతి అడ్డాగా మారింది. ఫలితంగా వైద్యశాఖ రూటే సపరేటుగా మారింది.

సాక్షి టాస్క్‌ఫోర్స్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు అవినీతి జాఢ్యం పట్టుకుంది. ప్రతి పనికీ కొందరు అధికారులు, సిబ్బందికి చేతులు తడపాల్సిందే. కాసుల వేటే ధ్యేయంగా విధులు నిర్వహిస్తున్నారు. పని ఆధారంగా పైసలు ఫిక్స్ చేసి పిండుకుంటున్నారు. ఇందుకు ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్ల యజమానులు బలవుతున్నారు. రిజిస్ట్రేషన్లు, లైసెన్స్‌లు, అనుమతుల పేరుతో ఆ సంస్థల నిర్వాహకులను అడ్డంగా దోచుకుంటున్నారు. పారదర్శక పాలనకు తూట్లు పొడుస్తూ ఆదాయార్జనే ధ్యేయంగా వైద్య ఆరోగ్య శాఖను వాడుకుంటున్నారు. కోనసీమ జిల్లాలో ఈ అవినీతికి ఓ వాట్సాప్ గ్రూప్ వేదికగా మారింది. అలాగే అనంతపురం జిల్లాలో ఓ ఆడియో లీక్ వైరల్‌గా మారింది. జిల్లాలో కూడా ఇదే పరిస్థితి దాపురించిందని అధికార వర్గాలు కోడైకూస్తున్నాయి.







రెండో రెవెన్యూగా ప్రసిద్ధి

వైద్య ఆరోగ్యశాఖ రెండో రెవెన్యూ అనే పేరును మూటకట్టుకుంది. ఎందుకంటే ప్రతి సేవకూ ఓ రేటు ఫిక్స్ చేశారు. కాసుల వేట కొనసాగిస్తున్నారు. దీంతో చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో పని చేయడానికి పలువురు ఉద్యోగులు, ఇతర జిల్లాలోని ఉద్యోగులు కూడా పోటీ పడుతున్నారు. పోస్టింగ్ తెచ్చుకోడానికి నువ్వా..నేనా అని కుస్తీ పడుతున్నారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో పనిచేసే ఉద్యోగులు, వైద్యులు, సిబ్బంది కూడా డెప్యూటేషన్‌పై కార్యాలయానికి రావడానికి పోటీపడుతున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో పరిధిలో 50 పీహెచ్‌సీలున్నాయి. 1200కు పైగా ప్రైవేటు ఆస్పత్రులు, 500కు పైగా ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లు ఈ శాఖ పరిధిలో ఉన్నాయి. అలాగే సినిమా థియేటర్ల యజమానులకు కూడా ఈ శాఖతో పని ఉంటుంది. మూడు అంతస్తుల్లో కార్యాలయం ఉండగా, పలు విభాగాలకు చెందిన 80 మందికిపైగా ఉద్యోగులు, సిబ్బంది పనిచేస్తున్నారు. వీరిలో కొంత మంది అవినీతికి ఆజ్యం పోస్తున్నారనే ఆరోపణలు భగ్గుమంటున్నాయి.



అవినీతి ఆరోపణ లివీ..

వైద్య ఆరోగ్యశాఖపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జూలైలో ఈ శాఖపై ప్రభుత్వానికి ఓ ఫిర్యాదు వెళ్లింది. అందులో ఏముందంటే.. ఉద్యోగస్తులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారని పేర్కొని ఉన్నట్లు సమాచారం. హెచ్ఆర్ఏ లాక్కుంటున్నారని, ఇది తప్పని చెబితే షోకాజ్ నోటీసులు ఇస్తున్నారని ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి. సొంత వాహనాలకు బిల్లులు చేసుకుంటున్నారని, కొంతమంది అర్బన్ హెల్త్ సెంటర్ల డాక్టర్ల నుంచి రూ. 30 వేల వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. పలమనేరులో ఓ ప్రైవేటు ఆస్పత్రిని తనిఖీ చేసి రూ. 2 లక్షలు వసూలు చేశారని అందులో రాసుకొచ్చారు. ఆ నగదు లావాదేవీలకు సంబంధించిన సాక్ష్యాధారాలు కూడా జత చేసినట్లు తెలిసింది. ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన ఓ అధికారి నుంచి ఇంక్రిమెంట్ మంజూరు చేయించుకోవడానికి రూ. 20 వేలు, ల్యాబ్ టెక్నీషియన్ పోస్టు భర్తీకి రూ.70 వేలు డిమాండ్ చేయగా..తొలి దఫా రూ. 40 వేలు ఇచ్చుకున్నారని ఆ ఫిర్యాదులు పేర్కొని ఉంది. రెడ్డెప్ప డెప్యూటేషన్, డ్యూటీకి రాకుండా జీతాలు తీసుకున్నందుకు రూ.50 వేలు డిమాండ్ చేసినట్లు ఆ ఫిర్యాదులో ఉంది. జగనన్న బ్యాగ్ ముద్రణలో గోల్‌మాల్, ఎన్ఆర్‌హెచ్ఎంలో పెద్ద మొత్తంలో నిధులు దుర్వినియోగం, నిబంధనలకు విరుద్ధంగా డిప్యూటేషన్లు వేశారని ఆ ఫిర్యాదులో బలంగా రాసుకొచ్చారు. దీనిపై రాష్ట్రస్థాయి విచారణకు ఆదేశించారు. అయితే ఓ వర్గం తనపై కక్ష కట్టి ఈ ఫిర్యాదు చేయించిందని మరో వర్గం జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లింది.

వసూళ్ల పర్వంపై గుసగుసలు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో కొందరు అధికారులు, సిబ్బంది చేసే వసూళ్ల పర్వంపై గుసగుసలు గుప్పుమంటున్నాయి. ఆస్పత్రుల రిజిస్ట్రేషన్ ఫీజులు రూ.10 వేలు ఉంటే.. ముడుపులు రూ.లక్షల్లో పలుకుతున్నాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. క్లినిక్ అయితే రిజిస్ట్రేషన్ నిమిత్తం రూ.2500 చెల్లించాల్సి ఉంది. నర్సింగ్ హోమ్‌లు రూ.3,750, 20 నుంచి 50 పడకల ఆస్పత్రికి రూ.7500, 50 పడకలు దాటితే రూ.10వేలు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలి. కొత్త స్కానింగ్ సెంటర్ రిజిస్ట్రేషన్‌కు రూ.35 వేలు చెల్లించాలి. ల్యాబోరేటరీలకు రూ.2500 చెల్లించాలి. సీటీ స్కాన్, ఎంఆర్ స్కాన్లకు అయితే రూ.17,500 చెల్లించాలి. అయితే ఇందుకోసం ఆస్పత్రి, ల్యాబ్, స్కానింగ్ సెంటర్‌కు వచ్చే ఆదాయం ఆధారంగా రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు వసూలు చేస్తున్నారనే విమర్శలు భగ్గుమంటున్నాయి. దీనితోడు రిజిస్ట్రేషన్, రెన్యూవల్ పత్రాలను సిద్ధం చేసేందుకు రూ.10 వేల వరకు గుంజేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సినిమా థియేటర్ల శానిటరీ సర్టిఫికెట్, టీఏ బిల్లులు, ప్రోగ్రాం బిల్లులు, బడ్జెట్ బిల్లులు ఇలా ప్రతి పనికీ ఓ రేటు ఫిక్స్ చేసి, వసూలు చేస్తున్నారని ఆ శాఖలోని కొందరు అధికారులే వాపోతున్నారు. ఇలా వచ్చిన వాటిలో మరికొందరు అధికారులు వాటాలు పంచుకుంటున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వసూళ్లకు భయపడి దూరం

వైద్య ఆరోగ్య శాఖలోని కొందరు అధికారులు, సిబ్బంది చేసే వసూళ్లతో పలు ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌లు, స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు హడలిపోతున్నారు. నెలవారీ మామూళ్లు ఇచ్చుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. ఈ భారాన్ని రోగులపై మోపుతున్నారు. రోగుల నుంచి అధిక ఫీజులు వసూలు చేసి నెలనెలా సంతృప్తి పరుస్తున్నారు. ఈ వసూళ్ల పర్వానికి భయపడి చాలా ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌లు, స్కానింగ్, ల్యాబ్ సెంటర్లు రిజిస్ట్రేషన్లకు దూరంగా ఉంటున్నాయి. కొందరైతే తనిఖీల పేరుతో హడావుడి చేసి రిజిస్ట్రేషన్‌కు దూరంగా ఉన్న వాటి నుంచి అధిక మొత్తంలో కాసులు గుంజేస్తూ..ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం లేదని విషయం బయటపడుతోంది. నెలనెలా వారి మామూళ్లు తెచ్చుకుంటున్నారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖలోని కొందరు అధికారులు బహిరంగంగా చెబుతున్నారు.

న్యూస్‌రీల్

జ్వరంతో ఆస్పత్రికి వస్తే రక్త పరీక్షలు తప్పనిసరి

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : ఎవరైనా రోగి జ్వరంతో ఆస్పత్రికి వస్తే రక్త పరీక్షలు చేయాలని, డెంగీ, మలేరియా నివారణకు రక్త పరీక్షలు అవసరమని జిల్లా మలేరియా అధికారి అనిల్ కుమార్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. చిత్తూరులోని డీఎంఅండ్‌హెచ్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ల్యాబ్ టెక్నీషియన్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా డెంగీ, మలేరియా తదితర వ్యాధులు విజృంభిస్తున్నాయన్నారు. ఈ తరుణంలో జ్వరంతో వస్తే రక్త పరీక్షలు విధిగా చేయాలన్నారు. ఈ ఫలితాల్లో పాజిటివ్ వస్తే, వెంటనే తగు వైద్య సేవలు అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో టీబీ మెడికల్ ఆఫీసర్ సాయి షర్మిల, ఏఎంఓ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

వరసిద్ధుడికి రూ.1.49 కోట్ల ఆదాయం



హుండీ కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

కాణిపాకం: వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం హుండీలను మంగళవారం లెక్కించారు. ఉదయం ప్రారంభమైన లెక్కింపు మధ్యాహ్నం వరకు సాగింది. హుండీ ద్వారా రూ.1,49,62,798 వచ్చాయని ఈఓ గురుప్రసాద్ తెలిపారు. గో సంరక్షణ హుండీ ద్వారా రూ.11,708, నిత్యాన్నదానం హుండీ ద్వారా రూ.31,751 వచ్చిందన్నారు. 491 యూఎస్ఏ డాలర్లు, 10 యూఏఈ దిర్హామ్‌లు, 178 మలేషియా రింగిట్స్, 20 కెనడా డాలర్లు, 15 ఆస్ట్రేలియా డాలర్లు, 5 గ్రాముల బంగారం, 2.785 కిలోల వెండి వచ్చిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు రవీంద్రబాబు, హరి మాధవరెడ్డి, ధనంజయ ప్రసాద్, సిబ్బంది కోదండపాణి, నాగేశ్వరరావు, సుబ్రమణ్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ఐ దామోదర్ వీఆర్‌కు బదిలీ

సాక్షి ఎఫెక్ట్..

పుంగనూరు: పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా పని చేస్తున్న దామోదర్‌ను వీఆర్‌కు పంపుతు ఎస్పీ మణికంఠ చందవోలు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. సివిల్ వ్యవహారంలో ఏఎస్ఐ దామోదర్ తలదూర్చి బాధితుడు మహబూబ్‌బాషాపై పోలీస్‌స్టేషన్‌లో దాడి చేసిన విషయంపై సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై సీఐ శ్రీనివాసులు దర్యాప్తు చేసి, ఎస్పీకి నివేదికలు పంపారు. ఏఎస్ఐ చర్యలను ఎస్పీ తీవ్రమైనవిగా భావించి, ఆయనను వీఆర్‌కు పంపుతు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఏఎస్ఐ విధుల నుంచి తప్పుకుని వెళ్లారు.

డీఎల్ఈడీ ఫలితాల విడుదల

చిత్తూరు కలెక్టరేట్ : డీఎల్ఈడీ మొదటి సంవత్సరం సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదల చేశారని డీఈఓ వరలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈ ఏడాది నవంబర్‌లో 4 నుంచి 9వ తేదీ వరకు డీఎల్ఈడీ (డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్) మొదటి సంవత్సరం (2018–20) సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించారన్నారు. ఈ పరీక్షల ఫలితాలను అభ్యర్థులు www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో పరిశీలించుకోవాలని డీఈఓ సూచించారు.

బాధితులకు న్యాయం చేస్తాం



బాధితులతో మాట్లాడుతున్న జేసీ విద్యాధరి

బైరెడ్డిపల్లి: బెంగళూరు–చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంలో భాగంగా భూములు, ఇళ్ల స్థలాలు కోల్పోతున్న బాధితులకు న్యాయం చేస్తామని జాయింట్ కలెక్టర్ విద్యాధరి తెలిపారు. బైరెడ్డిపల్లె సమీపంలో హైవే నిర్మాణ పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. రహదారికి ఆనుకుని ఉన్న కొంత మంది బాధితులు నష్టపరిహారం విషయంలో కోర్టును ఆశ్రయించారు. దీంతో రహదారి పనులు ఆగిపోవడంతో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 2016లో జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వహించిన నారాయణ భరత్ గుప్త బాధితులకు న్యాయం చేశారని, ఆ తరువాత వచ్చిన అధికారులు అన్యాయం చేయడంతో కోర్టును ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని బాధితులు ఆమెకు మొరపెట్టుకున్నారు. పరిహారం విషయంలో బాధితులకు న్యాయం చేస్తామని, ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళతామన్నారు. ఆమెతోపాటు ఆర్డీఓ భవానీ, తహసీల్దార్ మాధవరాజు, మండల సర్వేయర్ రామాంజులు ఉన్నారు.

ఎరువే.. పిడుగు



ఏటికేడు అన్నదాతల పరిస్థితి దయనీయంగా మారుతోంది. పెరిగిన సేద్యపు ఖర్చులకు తోడు ఎరువుల ధరలకు రెక్కలు రావడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఏటా పెరుగుతున్న ధరలతో కర్షకులకు కంటి మీద కునుకు లేకుండా పోతోంది. ఇప్పటికే పెట్టుబడి సాయం అటకెక్కి..దిగుబడులు తగ్గి.. గిట్టుబాటు లేక దిగాలు పడుతున్న పుడమిపుత్రులకు రసాయన ఎరువుల ధరల పెరుగుదలతో నెత్తిన పిడుగు పడినట్టయ్యింది.

- పెరిగిన రసాయన ఎరువుల ధరలు
- బస్తాపై రూ.100 నుంచి రూ.150 వరకు పెరుగుదల
- జిల్లాపై రూ.4 కోట్ల వరకు అదనపు భారం
- ఆందోళన చెందుతున్న రైతులు



విజయపురం: జిల్లాలోని రైతులకు ఎరువుల ధరలు పెనుభారమయ్యాయి. ధర అమాంతంగా పెరగడంతో రైతులకు కొనుగోలు శక్తి సన్నగిల్లింది. దీంతో రైతులు ఎరువుల కొనుగోలుపై ఆసక్తి చూపడం లేదు. పంటలకు కీలకమైన ఎరువుల ధర పెరగడంతో సాగు భారంగా మారిందని రైతులు ఆవేదనకు లోనవుతున్నారు. ఈ ప్రభావం రబీలో సాగు చేస్తున్న పంటలపై పడనుంది.

రబీలో 3.50 లక్షల ఎకరాల సాగు

ఈ ఏడాది రబీ సీజన్లో జిల్లాలోని 66 మండలాల్లో 1.49 లక్షల హెక్టార్లలో కంది, వరి, మినుము, పెసర, జొన్న, మొక్కజొన్న, వేరుశనగ, పప్పు, శనగ, ఆముదం, ఉల్లి తదితర పంటలు సాగు చేయనున్నారు. ఈ సాగుకు ఎరువుల భారం తప్పేలా లేదు. కంపెనీలు ఎరువుల ధరలను పెంచేశాయి. రైతులు ఎక్కువగా వాడే కాంప్లెక్స్ ఎరువులు ఒక్కో రకం ధర బస్తాపై రూ.100 నుంచి రూ.150 వరకు అదనంగా పెంచాయి. దీంతో జిల్లాలోని రైతులపై సుమారు రూ.4 కోట్లు అదనపు భారం పడనుంది.

అవసరం ఎక్కువ..వినియోగం తక్కువ

ఏ పంటకైనా సమతుల్యంగా ఎరువులు వేస్తేనే ఆశించిన దిగుబడులు వస్తాయి. అయితే రైతులు మాత్రం నత్రజని అందించే యూరియా అధిక మోతాదులో వాడుతూ డీఏపీ, ఎంఓపీ వంటి కాంప్లెక్స్ ఎరువులను బాగా తగ్గించేస్తున్నారు. ఎరువుల ధరలు పెరగడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఎకరా విస్తీర్ణంలోని వరి పంటకు డీఏపీ 52 కిలోలు వేయాల్సి ఉండగా 25 కిలోలే వినియోగిస్తున్నారు. ఎంఓపీ 33 కిలోలకు 15 కేజీలు వాడుతున్నారు. యూరియా 75 కిలోలకు బదులు 150 కిలోల వరకు వినియోగిస్తున్నారు. యూరియా ధర తక్కువగా ఉండడంతో అధికంగా వాడుతున్నారు. కాంప్లెక్స్ ఎరువుల ధరలు ఇప్పటికే అధికంగా ఉండగా, తాజాగా ధరలు పెరిగితే రైతులకు గడ్డు పరిస్థితి ఎదురయ్యే ప్రమాదం ఉంది.

ఎరువు పేరు	పాత ధర	పెరిగిన ధర (రూపాయిల్లో)
15-15-15	1,150	1,450
20-20-13	1,200	1,300
28-28-28	1,600	1,700
24-24-0	1,700	1,800
డీఏపీ	1,200	1,350
10-26-26	1,300	1,470

ధరల నియంత్రణ లేకుంటే సాగు భారం

ఈ ఏడాది వర్షాలు సంవృద్ధిగా కురవడం, సాగు నీరు పుష్కలంగా ఉండడంతో రైతులు పెద్ద ఎత్తున రబీ పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు. వరి, వేరుశనగ, మినుము, కంది, పెసర తదితర ఇతర పంటల వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. అలాగే జిల్లా ఉద్యాన పంటలు మామిడి, టమాట, బొప్పాయి, అరటి, పూలు, కూరగాయల పంటలు సుమారు రెండు లక్షల ఎకరాల్లో సాగవుతాయి. అన్ని పంటల్లో నాణ్యమైన దిగుబడులకు పొటాష్ ఎరువును రైతులు వినియోగిస్తుంటారు. గతేడాది వ్యవసాయ సీజన్ ప్రారంభం కంటే ఈ ఏడాది రబీ సీజన్ ప్రారంభంలోనే ధర అనూహ్యంగా పెరిగింది. ఒక్కొక్క రకం ఎరువు బస్తా(50 కిలోల)పై రూ.100 నుంచి రూ.150 వరకు పెరిగింది. ఎంటీపీ, ఎస్ఎస్‌పీ ఎరువుల ధరలు పెరగడంతో యూరియాకు డిమాండ్ పెరిగింది. ప్రభుత్వం ఎరువుల ధరలను నియంత్రించకపోతే తమకు సాగు భారమవుతుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎరువులు సబ్సిడీపై సరఫరా చేయాలి

రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులను సబ్సిడీపై సరఫరా చేయాలి. రబీ సీజన్‌లో పంటలు సాగు చేసుకునేందుకు పెట్టుబడి పెట్టే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో రైతాంగ ఇబ్బందులు గుర్తించి, రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులు సబ్సిడీపై సరఫరా చేయాలి.



– రవినాయుడు, గంగమాంబపురం

అన్నదాతలపై మోయలేని భారం

రైతులు వాతావరణ అననుకూల పరిస్థితుల మధ్య కొట్టుమిట్టాడుతున్న తరుణంలో కంపెనీలు వారి ఇష్టానుసారంగా ఎరువుల ధరలకు పెంచుతున్నాయి. రైతులపై మోయలేని భారం పడుతోంది. కేంద్ర ప్రభుత్వం ఎరువుల ధరలను నియంత్రించాలి. అప్పుడే సాగు ముందుకు సాగుతుంది.



– శేఖర్, పుత్తూరు

విద్యుత్ చార్జీల పెంపు దగా

- పూతలపట్టు ఇన్‌చార్జి డాక్టర్ సునీల్‌కుమార్ ఆగ్రహం



మాట్లాడుతున్న డాక్టర్ సునీల్‌కుమార్

బంగారుపాళెం : విద్యుత్ చార్జీల పెంపు దగా అని వైఎస్సార్ సీపీ పూతలపట్టు ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ మండిపడ్డారు. విద్యుత్ చార్జీలను పెంపును వ్యతిరేకిస్తూ మంగళవారం సాయంత్రం బంగారుపాళెంలోని జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్‌రాజా గృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపబోమని చెప్పిన కూటమి నేతలు గద్దెనెక్కిన వెంటనే చార్జీలు పెంచి పేదల నడ్డి విరుస్తున్నారని ఆరోపించారు. విద్యుత్ చార్జీలు పెంచనని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన చంద్రబాబు.. అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే ట్రూఅప్ చార్జీల పేరుతో రెండుసార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారాన్ని మోపారని మండిపడ్డారు. సంపద సృష్టి అంటే పేద, మధ్య తరగతిపై భారం మోపడమేనా? అని నిలదీశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ జగన్‌మోహన్ రెడ్డి నెరవేర్చారని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను గురించి ఎక్కడ ప్రశ్నిస్తారోనని చంద్రబాబు డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. తమ కార్యకర్తల స్వలాభం కోసం మద్యం పాలసీని మార్చి, దోచుకుంటున్నారని ఆరోపించారు. గ్రామాల్లో బెల్టుషాపుల ద్వారా మద్యం ఏరులైపారుతోందని ధ్వజమెత్తారు. నమ్మిన ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు మించిన వారు లేరన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోకపోతే ప్రజల తరఫున ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే లలితకుమారి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు సుబ్రమణ్యం, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు దత్తాత్రేయరెడ్డి, వడ్డెర, ఈడిగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్లు మొగిలీశ్వర్, ఎల్లప్ప, ఉపసర్పంచ్ కామరాజు, నేతలు కృష్ణమూర్తి, ప్రకాష్‌రెడ్డి, శ్రీనివాసులు, చంద్రశేఖర్‌రెడ్డి, జగదీష్, నాగరాజ, రఘు, పరదేశి పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 3 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 58,607 మంది స్వామివారిని దర్శించుకోగా 19,841 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.61కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది.

హైస్కూల్ ప్లస్‌లను కొనసాగించాలి

- ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ డిమాండ్



మాట్లాడుతున్న ఆపస్ రాష్ట్ర అధ్యక్షులు బాలాజీ

చిత్తూరు కలెక్టరేట్ : గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన హైస్కూల్ ప్లస్‌లను యథాతథంగా కొనసాగించాలని ఆపస్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నెలకొల్పిన హైస్కూల్ ప్లస్ విధానం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉపయోగకరమన్నారు. ముఖ్యంగా బాలికా విద్యను పటిష్టం చేయాలనే మహోన్నత సంకల్పంతో ప్రతి మండలానికి ఒక హైస్కూల్ ప్లస్ ఏర్పాటు చేశారన్నారు. అర్హత ఉన్న స్కూల్ అసిస్టెంట్లకు ఒక ఇంక్రిమెంట్ పారితోషికంగా ఇచ్చి విధుల్లో నియమించి ఇంటర్మీడియట్ విద్య అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. అయితే నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హైస్కూల్ ప్లస్‌లను పటిష్టం చేయాల్సింది పోయి, వాటిని రద్దు చేసి ఇంటర్మీడియట్ శాఖ వారికి అప్పగిస్తామని ప్రకటించడం అన్యాయమన్నారు. ఇది ఏమాత్రం సబబు కాదన్నారు. ఒక స్కూల్ అసిస్టెంట్ 24 సంవత్సరాలు పూర్తి కావొస్తున్నా ఉద్యోగోన్నతి పొందలేకపోతున్నారని చెప్పారు. ఏకీకృత సర్వీసు రూల్స్ అమలులో ఇబ్బందులు ఉన్నందున కనీసం హైస్కూల్ ప్లస్ విధానంలోనైనా ఉద్యోగోన్నతులు పొందుతున్నారన్నారు. ఇలాంటి తరుణంలో కూటమి ప్రభుత్వం ఇలాంటి ప్రకటనలు చేయడంతో ఉపాధ్యాయులు నిరాశకు లోనవుతున్నారని చెప్పారు. ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచించి హైస్కూల్ ప్లస్ బలోపేతానికి కృషి చేయాలని బాలాజీ డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

బాత్‌రూమ్‌లో స్పృహ తప్పి యువతి మృతి

పుంగనూరు: పట్టణంలోని బీడీకాలనీలో మౌనిక(22) అనే యువతి బాత్‌రూమ్‌లో స్పృహ తప్పి మృతి చెందిన సంఘటన మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. అనంతపురం పట్టణంలోని సంపత్ కుమారై మౌనిక పుంగనూరులో ఉన్న తన మేనత్త ఇంటికి వచ్చింది. ఆమె ఉదయం అత్త ఇంట్లో స్నానం చేసేందుకని బాతురూమ్ లోపలికి వెళ్లి ఎంతసేపైనా బయటకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు తలుపులు పగలగొట్టి చూసేసరికి మౌనిక స్పృహ తప్పి పడి ఉండటాన్ని గుర్తించి, హుటాహుటిన స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి, అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. శవాన్ని పోస్టుమార్టానికి తరలించి, ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

అదుపు తప్పి కారు బోల్తా



కాలువలో పడిన కారు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలం పాలూరు బ్రిడ్జి వద్ద మంగళవారం వేకువజామున ఓ కారు అదుపు తప్పి బోల్తా పడింది. తమిళనాడు నుంచి చిత్తూరు వైపు వస్తున్న ఈవాహనం బ్రిడ్జిన్ని ఢీకొని కాలువలో పడిపోయింది. వర్షం కారణంగా ముందు రోడ్డు సక్రమంగా కనిపించకపోవడంతో ఈ ఘటన జరిగిందని, కారులో ప్రయాణిస్తున్న భార్యభర్తలు, ఇద్దరు పిల్లలు స్వల్పగాయాలతో బయటపడ్డారని స్థానికులు చెప్పారు.

బస్సు.. కస్సు లెన్నో..!

అరచేతిలో స్వర్గం చూపిన చందంగా బస్సుల యాజమాన్యాలు అయ్యప్పస్వామి భక్తులకు నరకం చూపుతున్నాయి. శబరిమల యాత్రకు భక్తులు బుక్ చేసుకునే బస్సుల చిత్రాలు ఒకటి చూపి.. తీరా ప్రయాణానికి ఫిట్ లెస్ లేని బస్సులను పంపుతున్నారు. దీంతో అయ్యప్ప స్వామి భక్తుల ప్రయాణం భారంగా మారుతోంది. ఇక ఆర్టీసీ బస్సుల విషయానికొస్తే అవి ఇంకా అవస్థల యాత్రగా ఉంది. ఫలితంగా భక్తులు ఇక్కట్లు పడుతున్నారు.

బస్సు..ఫిట్ లెస్సు.. అవస్థలు మస్తు
- అయ్యప్పస్వాముల యాత్రకు బస్సుల కష్టాలు
- బొమ్మ ఒకటి.. బస్సు మరొక్కటి..
- విధిలేని పరిస్థితుల్లో రైట్..రైట్
- అదును చూసి అధిక రేట్లు
- టీవీలు, వీడియోలు గరంగరం
- ప్రయాణంలో సొమ్మసిల్లితున్న స్వాములు



బస్సులో ప్రయాణిస్తున్న అయ్యప్పస్వామి భక్తులు

కాణిపాకం: అయ్యప్పస్వాములకు టూరిస్టు బస్సు నిర్వాహకులు శఠగోపం పెడుతున్నారు. బస్సుల బొమ్మలను చూపి బుకింగ్ చేయిస్తున్నారు. చివరకు డొక్కు బస్సులను తగిలిస్తున్నారు. విధిలేని పరిస్థితుల్లో వాటిల్లోనే భక్తులు ప్రయాణం సాగిస్తున్నారు. ఇదే అదునుగా భావించిన ప్రైవేటు బస్సు ల యాజమాన్యాలన్నీ సిండికేట్ అయ్యి, అధిక రేట్లు వసూలు చేస్తున్నాయి. ఇవి ఇలా ఉంటే ఆర్టీసీ బస్సులు చూస్తే కస్సుబస్సుమంటున్నాయి. టీవీలు, వీడియోలు గరంగరంమంటున్నాయి. ఈ కష్టాల ప్రమాణంలో స్వాములు సొమ్మసిల్లిపోతున్నారు.

అధిక శాతం బస్సుల్లోనే ప్రయాణం

కార్తీక, మార్గశిర మాసాల్లో అయ్యప్పస్వాములు దీక్షలు చేపడతారు. 45 రోజులు దీక్ష చేపట్టి ఇరుముడితో కేరళలోని శబరిమల శ్రీఅయ్యప్పస్వామివారిని దర్శించుకుంటారు. బస్సులో పంబ వరకు వెళుతుంటారు. ఏటా జిల్లాలో 60 వేల నుంచి 80 వేల మంది అయ్యప్పస్వామి భక్తులు నిష్టతో దీక్షలు చేపట్టి జ్యోతి దర్శనం చేసుకుంటారు. ఇందుకు కొందరు రైలు, ట్యాక్సీలు బుక్ చేసుకుంటున్నారు. అధిక శాతం మంది బస్సులు బుకింగ్ చేసుకుని వెళుతున్నారు. గతంలో ఎక్కువగా ప్రైవేటు బస్సులను ఆశ్రయించేవారు. అయితే కొంతమంది బస్సు నిర్వాహకులు గోల్‌మాల్‌కు పాల్పడుతున్నారు. భక్తులకు ఫొటోలో ఒక బస్సును చూపించి..శబరిమలైకు వెళ్లే సమయంలో మరో బస్సు పంపిస్తున్నారనే ఆరోపణలు ఎక్కువగా వస్తున్నాయి. ఆ బస్సులు డొక్కుగా ఉండడంతో ప్రయాణంలో ఒళ్లు గుల్ల అవుతోందని వాపోతున్నారు. గమ్యానికి చేరుకోవడానికి అదనపు సమయం పడుతోందని చెబుతున్నారు. ఇక నిర్వాహకులు కొందరు సీజన్‌ను అదునుగా చేసుకుని చార్జీలు పెంచేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇష్టానుసారంగా స్వాములను దోపిడీ చేస్తున్నారు. బస్సులు మొత్తం బుకింగ్ అయ్యాయని చెప్పి సర్దుబాటు పేరుతో స్వాముల జేబులకు కత్తెర వేస్తున్నారు. బస్సు సామర్థ్యం, వసతులు తదితరాలను చూసి అదనంగా వసూలు చేస్తున్నారు. దీంతో భక్తులు ఆర్టీసీ వైపు మొగ్గు చూపారు. అయితే ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణంలో కూడా స్వాములు అవస్థ పడక తప్పడం లేదు. సగం ప్రయాణం స్వామి శరణాలతో ముగుస్తుంది. మిగిలిన ప్రయాణంలో కాలక్షేపంలో ఆడియో, వీడియోలు మూగబోతున్నాయి. టెక్నాలజీకి తగ్గట్టు బస్సులో ఆడియో, వీడియో సిస్టమ్‌లు లేవు. ఉన్న ఆ పరికరాలకు రిమోట్ కూడా ఉండదు. ఆపరేటింగ్ మొత్తం ఎక్కడో ఉన్న డిపో అధికారులు చేతిలో ఉంటే ఎలా? అంటూ ప్రశ్నిస్తున్నారు. అడిగినంత డబ్బులు ఇచ్చి ఈ ప్రయాణం ఎందుకు స్వామి అని తలలు పట్టుకుంటున్నారు.

డబ్బులు మేం కడితే పెత్తనం వారిదా?



ఆర్టీసీ యాజమాన్యం అడిగినంత ఇచ్చుకున్నాం. ఐదు రోజుల యాత్రకు రూ.1.80 లక్షలు చెల్లించుకున్నాం. 36 మంది ప్రయాణం చేశాం. అయితే ఆ బస్సుల్లో సదుపాయాలు కరువయ్యాయి. వీడియో, ఆడియోలు లేవు. కొన్నింటిలో వారు ఇచ్చిన సినిమాలు, ఆడియోలను మాత్రమే చూడాలి. ఎక్కువ రోజులు యాత్రలో అవి మళ్లీ..మళ్లీ చూసి బోర్ కొడుతోంది. మార్పులు చేస్తే బాగుంటుంది.

–రోజాకృష్ణ, అయ్యప్పస్వామి భక్తుడు, వీరకనెల్లూరు, జీడీనెల్లూరు మండలం

ఉత్తమ ల్యాబ్ టెక్నీషియన్‌గా భువనేశ్వరి



భువనేశ్వరిని అభినందిస్తున్న డాక్టర్ శిరీష

బంగారుపాళెం: స్థానిక ప్రభుత్వాస్పత్రి ఐసీటీసీ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న భువనేశ్వరి జిల్లా ఉత్తమ ల్యాబ్ టెక్నీషియన్‌గా ఎంపికైనట్లు ప్రధాన వైద్యాధికారి డాక్టర్ శిరీష మంగళవారం తెలిపారు. అంతర్జాతీయ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా చిత్తూరులో ఉత్తమ సేవలు అందించిన వారికి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారని చెప్పారు. భువనేశ్వరి జిల్లా స్థాయిలో ఉత్తమ ల్యాబ్ టెక్నీషియన్‌గా ఎంపికైందన్నారు. జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ వెంకటప్రసాద్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా భువనేశ్వరిని పలువురు డాక్టర్లు, సిబ్బంది అభినందించారు.

నిందితుడి అరెస్టు

సత్యవేడు : మండలంలోని కొల్లడం ఎస్టీ కాలనీలో 72 బస్తాల రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేసిన కేసులో ప్రధాన నిందితుడు దిలీప్ రెడ్డి (28)ని శ్రీసిటీ పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం శ్రీసిటీ పరిధిలోని జీరో పాయింట్ వద్ద నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

ప్రతిభకు వైకల్యం అడ్డుకాదు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రతిభకు వైకల్యం అడ్డుకాదని ట్రైనీ కలెక్టర్ హిమవంశీ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించారు. అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వైకల్యం అనేది మనిషికే గాని మనస్సుకు కాదన్నారు. విభిన్న ప్రతిభావంతుల ప్రతిభ ముందు వైకల్యం చిన్నబోతుందన్నారు. క్రీడలు, విద్యలో రాణించి విభిన్నప్రతిభావంతులు సకలాంగులకు దీటుగా సత్తా చాటుకోవాలన్నారు. విభిన్నప్రతిభావంతులకు అవసరమైన తోడ్పాటును అందిస్తే ఎటువంటి విజయాలనైనా సాధించగలుగుతారన్నారు. ప్రతిభావంతులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడంతో పాటు వారిలో మానసిక స్థైర్యాన్ని నింపేందుకు చర్యలు చేపట్టాలన్నారు. విభిన్న ప్రతిభావంతులు తెలియజేసిన సమస్యలను కలెక్టర్‌కు నివేదించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ కార్యాలయ భవనాల్లో అంగ వైకల్యంతో నడవలేని స్థితిలో ఉన్న వారి కోసం ర్యాంప్ లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. నగర మేయర్ అముద మాట్లాడుతూ వైకల్యాన్ని ఆలోచించకుండా విద్య, క్రీడా రంగాల్లో రాణించేలా విభిన్న ప్రతిభావంతులు ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం 10 మంది విభిన్నప్రతిభావంతులకు టచ్‌ఫోన్‌లు, నలుగురికి హియరింగ్ ఎయిడ్స్ అందజేశారు. అనంతరం విభిన్నప్రతిభావంతుల అసోసియేషన్ నాయకులు మురళిని అతిథులు దుశ్శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విభిన్నప్రతిభావంతుల శాఖ ఏడీ శ్రీనివాస్, జిల్లా మైనార్టీ కార్పొరేషన్ ఈడీ హరినాథరెడ్డి, ఐసీడీఎస్ పీడీ హైమావతి, పలు ప్రాంతాలకు చెందిన విభిన్నప్రతిభావంతులు పాల్గొన్నారు .



విభిన్న ప్రతిభావంతుల సంఘ నాయకుడు మురళిని సత్కరిస్తున్న ట్రైనీ కలెక్టర్ హిమవంశీ

వరప్రదాయిని.. వైనతేయ ప్రణమిల్లి..



తిరుచానూరు పద్మావతీ అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి అమ్మవారు గరుడ వాహనంపై విహరించారు. ఉదయం సర్వభూపాల వాహనం, సాయంత్రం స్వర్ణ రథంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. -చంద్రగిరి

విభిన్న ప్రతిభావంతులకు విశేష ప్రతిభ

చిత్తూరు కలెక్టరేట్ : విభిన్నప్రతిభావంతులకు విశేష ప్రతిభ ఉంటుందని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బాలాజీ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో ఉన్న భవిత పాఠశాలలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు తల్లిదండ్రుల ప్రోత్సాహం గొప్పదన్నారు. వారిని ప్రోత్సహిస్తే అనేక అంశాల్లో రాణిస్తారన్నారు. అనంతరం విభిన్న ప్రతిభావంతులకు పలు క్రీడలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి శరత్, తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న బాలాజీ

కుప్పం కాలువ లైనింగ్‌కు గ్రీన్‌సిగ్నల్

- రూ.196.91 కోట్లతో పనులకు అనుమతి
- జీఓ జారీ చేసిన ప్రభుత్వం
- త్వరలో టెండర్ల నిర్వహణకు చర్యలు

కుప్పం: పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో సాగే కుప్పం ఉప కాలువ లైనింగ్ పనులకు అనుమతి ఇస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పనులు చేపట్టేందుకు హంద్రీనీవా ప్రాజెక్టు అధికారులు ప్రతిపాదనలు పంపగా ప్రభుత్వం ఆమోదం తెలిపి, బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. తదుపరి చర్యలకు ప్రాజెక్టు ఉన్నతాధికారులు చర్యలు చేపడతారని ఆ ఆదేశాల్లో పేర్కొంది. జిల్లాలోని పుంగనూరు నియోజకవర్గం నుంచి కుప్పం నియోజకవర్గానికి కృష్ణా జలాలను తరలించేందుకు కుప్పం ఉపకాలువ నిర్మాణం టీడీపీ గతంతో చేపట్టింది. 123 కిలోమీటర్ల కుప్పం కాలువ పనిలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మార్పులు చేపట్టింది. ప్రస్తుతం ప్రభుత్వం నిర్ణయించిన లైనింగ్ పనులను కుప్పం కాలువలోని కిలోమీటరు 0.000 నుంచి 66.900 కిలోమీటరు వరకు రూ.99.20 కోట్లు, కిలోమీటరు 66.900 నుంచి కిలోమీటరు 131.200 వరకు రూ.97.71 కోట్లతో లైనింగ్ పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేసింది. ఈ పనికి పాలనాపరమైన అనుమతులు ఇచ్చిన ప్రభుత్వం టెండర్ల నిర్వహణకు చర్యలు చేపట్టనుంది. ఈ పనులు పూర్తయితే అన్నమయ్య జిల్లా నుంచి కృష్ణా జలాలు కుప్పం వైపునకు ప్రవహిస్తాయి. తంబళ్లపల్లె, మదనపల్లె, పుంగనూరు, పలమనేరు నియోజకవర్గాలు దాటుకుని కుప్పంకు రావాల్సి ఉంది. కృష్ణా జలాలు సుదూరం ప్రవహించి కుప్పం చేరుకోవాలంటే 350 కిలోమీటర్లు సాగాలి. దీంతో నీటి ప్రవాహం తగ్గుతుందని గుర్తించిన ప్రభుత్వం పుంగనూరు ఉపకాలువ కిలోమీటరు 189.80 నుంచి కుప్పం ఉపకాలువ మొదలు అయ్యే కిలోమీటరు 207.800 అప్పినపల్లె వద్ద వరకు 18 కిలోమీటర్లు కాలువ విస్తరణ పనులు చేయాలని నిర్ణయించింది. ఇక్కడ కాలువలో నీటి ప్రవాహం పెంచితే కుప్పానికి వచ్చే నీటి ప్రవాహం పెరుగుతుందని ప్రాజెక్టు అధికారులు నిర్ణయించారు. దీనితో 18 కిలోమీటర్ల కాలువను లైనింగ్ పనుల్లో భాగంగా వెడల్పు చేయనున్నారు.



కుప్పం హంద్రీనీవా కాలువ

ఎంపీ లాడ్స్ ఖర్చులో అలసత్వం వద్దు

చిత్తూరు కలెక్టరేట్ : ఎంపీ లాడ్స్ నిధుల ఖర్చులో అలసత్వం వద్దని కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో ఎంపీ లాడ్స్ నిధుల వినియోగంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎంపీ లాడ్స్‌లో జిల్లాకు అందిన నిధులను సకాలంలో ఖర్చు చేయాలన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.4.81 కోట్ల అంచనా వ్యయంతో 88 పనులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందులో రూ.73 లక్షలతో 25 పనులు పూర్తి కాగా, 13 పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. పురోగతిలో ఉన్న పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంకనూ ప్రారంభించని పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. మంజూరైన పనులలో రూ.5 లక్షల లోపు అంచనా వ్యయంతో ఉన్న పనులను డిసెంబర్ నెలాఖరులోపు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. రూ.5 లక్షల పై అంచనా కలిగిన పనులను మార్చి 2025 లోపు పూర్తి చేయాలన్నారు.

పంచాయతీరాజ్ శాఖ పరిధిలో.....

జిల్లా పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో ఉపాధి హామీ పథకం కింద జిల్లాకు రూ.91.65 కోట్లతో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, ప్రహరీ గోడలు తదితర 1,598 పనులు మంజూరు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఇందులో అంతర్గత సీసీ రోడ్లకు రూ.24.24 కోట్లతో 435 పనులు పూర్తి చేశామన్నారు. సీసీ అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి రూ.82 లక్షలతో 12 పనులను పూర్తి చేశారన్నారు. సీపీఓ సాంబ శివారెడ్డి, పీఆర్ డీఈ చంద్రశేఖర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నరేంద్ర ,చిత్తూరు మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

లక్ష్యసాధన తప్పనిసరి

మైక్రో ఇరిగేషన్ అధికారులు క్షేత్రస్థాయిలో నిర్దేశించిన లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో మైక్రో ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి మండలానికి నిర్దేశించిన మైక్రో ఇరిగేషన్ లక్ష్యాలు చేరుకోవాలన్నారు. జిల్లాలో ఉద్యాన పంట సాగుకు అనుకూలమైన మండలాల్లో బిందు, తుంపర సేద్యం విధానాన్ని అవలంభించేలా ప్రోత్సహించాలన్నారు. ప్రతి మండలంలో కనీసం 20 హెక్టార్లలో బిందు, తుంపర సేద్యం సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ, ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి, జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పెండింగ్ వర్క్ ఆర్డర్లను త్వరితగతిన పూర్తి చేయండి

చిత్తూరు కార్పొరేషన్ : జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న వర్క్ ఆర్డర్లకు సంబంధించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ట్రాన్స్‌కో ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆ శాఖ జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఎస్ఈ మాట్లాడుతూ వర్క్‌ఆర్డర్లకు సంబంధించిన పనులు పూర్తి చేయకపోతే వేతనాలు ఆపి వేస్తామని హెచ్చరించారు. వర్క్ ఆర్డర్ల పనుల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. ఇంజినీర్లు తమ వంతు బాధ్యతగా పనిచేయాలన్నారు. నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి చేయాలని ఆదేశించారు. ట్రాన్స్‌ఫార్మర్ల పెయిల్యూర్‌ను తగ్గించాలన్నారు. వందశాతం విద్యుత్ బిల్లుల వసూలు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఈఈలు మునిచంద్ర, సురేష్, శ్రీనివాసమూర్తి, వాసుదేవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్

ఉత్తమ ఫలితాల సాధనకు 'సంకల్పం'

- ప్రత్యేక తరగతులు పరిశీలించిన డీవీఈఓ సయ్యద్ మౌలా

చిత్తూరు కలెక్టరేట్ : ఇంటర్మీడియట్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు గాను సంకల్పం ప్రత్యేక కార్యక్రమం ప్రారంభించారని ఇంటర్మీడియట్ డీవీఈఓ సయ్యద్ మౌలా అన్నారు. ఆయన మంగళవారం నగరంలోని కణ్ణన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేక తరగతులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల అభ్యసన స్థాయికి అనుగుణంగా ఏ,బీ,సీ గ్రూపులుగా విభజించి సంకల్పం కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేలా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. వెనుకబడిన విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠ్యాంశాలను బోధించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. సాయంత్రం ప్రత్యేకంగా స్టడీ అవర్స్‌లో విద్యార్థులకు బిస్కెట్లు, స్నాక్స్ అందిస్తున్నట్లు తెలిపారు. ఎంపీసీ విద్యార్థులకు విద్యాశక్తి కార్యక్రమంలో ఐఐటీ చెన్నై విద్యాసంస్థ సహకారంతో ఆన్‌లైన్ ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఈ శిక్షణ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం విద్యార్థుల అభ్యసన స్థాయిలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కణ్ణన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ మురళీకృష్ణ, రియాజ్‌భాషా, ఏలుమలై తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు విద్యార్థికి ఐకాన్ అవార్డు

- హైకోర్టు జడ్జి చేతుల మీదుగా అవార్డు స్వీకరణ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రమైన చిత్తూరులోని విజయం ఎంబీఏ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి హరీష్ ఇంటర్నేషనల్ వరల్డ్ రికార్డు ఆధ్వర్యంలో ఐకాన్ అవార్డు అందుకున్నారు. జిల్లాలోని ఐరాల మండలం 45 కొత్తపల్లెకు చెందిన బాలాజీ కుమారుడు హరీష్‌బాబు జిల్లా కేంద్రంలోని విజయం కళాశాలలో ఎంబీఏ చదువుతున్నాడు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యువ సంఘం యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్‌లో చిత్తూరు జిల్లా తరపున పాల్గొన్నారు. ఏక్‌భారత్ శ్రేష్ఠ భారత్‌లో కేంద్ర ప్రభుత్వం ఉత్తరప్రదేశ్ అలహాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో నవంబర్ 26 నుంచి డిసెంబర్ ఒకటో తేదీ వరకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న హరీష్ ప్రతిభ చాటారు. ఇందుకుగాను అలహాబాద్ హైకోర్టు జడ్జి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్, ట్రిపుల్ ఐటీ అలహాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ ముఖుల్ సుతానే చేతుల మీదుగా ఐకాన్ అవార్డు ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ విద్యార్థిని విజయం విద్యాసంస్థల చైర్మన్ తేజోమూర్తి, అధ్యాపక బృందం అభినందించారు.



అలహాబాద్ జడ్జి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న విద్యార్థి హరీష్

నేటి నుంచి న్యాయవాదులు విధుల బహిష్కరణ

చిత్తూరు అర్బన్: నగరంలో బుధవారం నుంచి ఈ నెల 7వ తేదీ వరకు న్యాయవాదులంతా విధులను బహిష్కరించాలని బార్ అసోసియేషన్ ఏకగ్రీవంగా తీర్మానించింది. మంగళవారం జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. జిల్లాలో గంజాయి కేసులన్నీ ప్రస్తుతం చిత్తూరు మొదటి అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో విచారణ జరుగుతున్నాయి. ఈ కేసుల విచారణ మొత్తం ఇక నుంచి తిరుపతిలో నిర్వహించాలని ప్రభుత్వం ప్రతిపాదన తీసుకొచ్చింది. దీన్ని నిరసిస్తూ మూకుమ్మడిగా విధులను బహిష్కరిస్తున్నట్టు చిత్తూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజేంద్రరెడ్డి, అశోక్ ఆనంద్ యాదవ్ తెలిపారు.